''టర్మ్ ఫీజు కట్టాలంట... మూడొందల రూపాయలు పంపించమంటున్నాడు'' ఉత్తరాన్ని వెంకటయ్యకు తిరిగిఇచ్చేస్తూ చెప్పాడు సుబ్బారెడ్డి.

''మొన్ననే కదు రెడ్డీ రెండొందలు పంపించింది. ఈడుసదివే ఇంటర్మేటుకే ఇంత డబ్బు ఖర్చైతే పై సదువులు పూర్తయ్యే వాల్టికి పొలమంతా అమ్మేసి చిప్ప పట్టుకొని పోవాల్సేను!''

''అట్లంటే ఎట్లా? మనకంటే... ఆకాశం తట్టు చూస్తూ బతకాల్సిన ఖర్మ పట్టింది. మన పిల్లలకు ఆగతి ఎందుకు పట్టాలి? రేపు నీ కొడుక్కు గవుర్మెంటు వుజ్జోగంవస్తే కాలుమీదకాలు వేస్కొనిసంపాదించడూ... నీవు ఖర్చు పెట్టిందంతా రెండేళ్ళలో సంపాదిస్తాడు. ఇంక ఇప్పుడు ఖర్చులంటావా... వాడు చదివేది ప్రైవేటు కాలేజి కదా... ఫీజులు అవీ కొంచెం ఎక్కువగానే వుంటాయి. ఏణ్ణోచోట సర్దుదాంతే... వాణ్ణి మాత్రం బాగా చదివించు''

** ** **

మనియార్డర్ తీసుకొచ్చిన పోస్ట్‌మన్‌ను చూడగానే సుబ్బరాయుడి ముఖం ఆనందంతో వెలికి పోయింది. పోస్ట్‌మన్ దగ్గర మూడొందలు తీసుకొని మూడురూపాయలు చేతిలోపెట్టి, సైకిల్ తీసికొని హుషారుగా బయలుదేరాడు ఆఫీస్‌కు.

ఆఫీస్ అంటే-

గవర్నమెంట్ ఆఫీస్‌కాదు.

ప్రైవేట్ కంపెనీ ఆఫీసూకాదు.

అది ఫిలిం ఫాన్స్ అసోసియేషన్ ఆఫీస్.

జూనియర్ కాలేజిలో చేరిన రోజునుంచి అభిమాన సంఘం కార్యకలాపాల్లో తీరిక లేకుండా పాల్గొంటూ ఇప్పుడు అసోసియేషన్ సెక్రటరీ స్థానాన్నిసంపాదించాడు. సుబ్బరాయుడు లేక పోతే ఏ పనీ జరుగదు అనిపించుకొన్నాడు. అతను ఏ నిర్ణయం తీసుకొన్నా ఎదురు చెప్పేవాళ్ళు లేరు. డిస్ట్రిబ్యూటర్ల నుండి వచ్చే వాళ్ళ హీరో జెయింట్‌సైజ్ కటౌట్‌నుఏస్థానంలోవుంచాలి... దాన్ని ఎలా అలంకరించాలి... అభిమాన సంఘంతరపున హీరో పెయింటింగ్ ఎలా వేయించాలి. బ్యానర్లు ఎలా రాయించాలి... కరపత్రాన్ని ఎలా ముద్రించాలి... ఎలా పంచిపెట్టాలి.... అసోసియేషన్ మనుగడుకు వనరుల ఎలా సమీకరించాలి... మొదలైన విషయాలన్నీ అతనే స్వయంగా చూసుకుంటాడు.

ఆ రోజు ఆఫీస్ బేరర్ల సమావేశం ఏర్పాటుచేసి ఉపన్యాసం ప్రారంభించాడు.

''మన అసోసియేషన్ కార్యకలాపాలు మన హీరో సినిమా వచ్చినప్పుడు మాత్రమే ముమ్మరంగా కొనసాగుతున్నాయ్. మిగతాటయిమ్‌లో ఖాళీగావుంటున్నాం. మన సంఘాన్ని ప్రజల దృష్టికి తీసుకురావడం ముఖ్యం. మనహీరోకు పాపులారిటీ రావాలన్నా, మన సంఘానికి పబ్లిసిటీ కావాలన్నా మనం కొన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టాలి... అంటే అన్నదానం, రక్తదానం, శ్రమదానం లాంటివి. ఇందువల్ల మన హీరో ఇమేజ్ పెరగడమేకాకుండాకొత్తవాళ్ళు సభ్యులుగాచేరే అవకాశం కూడా వుంటుంది......''

అందరూ చప్పట్ల ద్వారా తమ ఆమోదాన్ని తెలియజేశారు.

''...ఇకపోతే మన అసోసియేషన్‌కు ఫండ్స్ తక్కువగా వున్నాయి. ఫండ్స్ కోసం ఎవరి దగ్గర్నుంచో ఎదురు చూసేదాని కంటే మనమే ముందు జాగ్రత్తగావనరులను సమీకరించుకుంటే అత్యవసర పరిస్థితుల్లో మన కార్యకలాపాలకు అడ్డంకులు లేకుండా వుంటాయి. ఇందు కోసం కొన్ని కల్చరల్ ప్రోగ్రామ్స్‌ని అరేంజి చేయడం, ప్రివ్యూషోలను ప్రదర్శింప చేయడం లాంటివే కాకుండా మనంకూడా శక్తికొద్ది చందాలివ్వాలి. నా వంతు చందాగా రెండొందల రూపాయల్ని ఈ రోజు జయచేస్తున్నాను''

పెద్దపెట్టున చప్పట్లు మ్రోగాయి.

** ** **

పరీక్ష ఫీజు కట్టాలంటే రెండొందలు పంపించాడు వెంకటయ్య. డబ్బు పంపుతూ... ఆ డబ్బు సమకూర్చుకోవడంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాననీ, తన ఆశల్ని వమ్ము చేయొద్దనీ, పరీక్షలు బాగా రాయమనీ సుదీర్ఘమైన లేఖరాశాడు. ఎప్పుడూ వుంటే సోదే లెమ్మని వుత్తరాన్ని అల్మెరాలో పడేసి ఆఫీస్‌కు బయలుదేరాడు.

ఇంకో ఇరవై రోజుల్లో తన హీరో నటించిన చిత్రం




విడుదల కాబోతుంది. తను కార్యదర్శి పదవిని అలంకరించిన తర్వాత వస్తున్న మొదటి చిత్రమది. సినిమా విడుదలకు నాల్రోజుల ముందు నుంచే తన పరీక్షలు. మరోవైపు తన నాయకత్వానికి పరీక్ష. ఏ పరీక్ష ముఖ్యమనే విషయంలో అతను సందిగ్ధంలో పడలేదు. తనపై పెంచుకున్న సభ్యుల ఆశల్ని వమ్ము చేయదలచుకోలేదు.

అన్ని కార్యకలాపాల్ని పకడ్బందీగా రూపొందించాడు.

లాంగ్వేజి పేపర్లు సరిగా రాయలేదు. గ్రూపు పేపర్లలో పాస్ మార్కులొస్తే చాలనుకున్నాడు. అయినా కాన్ఫిడెన్స్ లేదు.

తెల్లారితే ఫిజిక్స్‌పరీక్ష...తెల్లవారక ముందే ఒకటిన్నర గంటలకు ప్రివ్యూ షో. ముందు రోజంతా సినిమా హాలొద్దగ్గరే అలంకరణల పర్యవేక్షణ.

హీరో కనిపించిన మొదటి సన్నివేశంలో స్క్రీన్ దగ్గరికి పోయి టెంకాయ కొట్టడం, డ్యూయెట్ సీన్లో, కర్పూరాన్ని వెలిగించి హారతి పట్టడం, స్టంట్ సీన్లో ఈలలు, కేకలు, చప్పట్లు... మొత్తానికి నాలుగున్నరకు సినిమా అయిపోయింది. ప్రివ్యూ షో విజయ వంతంగా ముగిసింది.

అయిదున్నరకు రూముకు పోయిపడుకున్నాడు. నిద్ర ఒక పట్టాన రావడంలేదు. ఆ సినిమా ఎన్ని రోజులు నడుస్తుంది? ఎన్ని కేంద్రాల్లో శత దినోత్సవం జరుపుకుంటుంది? ఎంత కలెక్షన్లను సంపాదిస్తుంది? కలెక్షన్లలో పాత రికార్డును బ్రేక్ చేస్తుందా లేదా?... ఆలోచిస్తూ... ఆలోచిస్తూ ఆరున్నరకు నిద్రలోకి జారుకున్నాడు.

నిద్రలేచేప్పటికి టైం పదకొండు! పరీక్షకు పోలేకపోయినందుకు తనలో తాను స్వల్పంగా తిట్టుకున్నాడు. పరీక్షల టైంలో ఆ సినిమాను రిలీజ్ చేసినందుకు నిర్మాతను పదేపదే తిట్టుకున్నాడు. అక్టోబరు ఆశా కిరణం కనిపించింది. మళ్లీ పడుకున్నాడు.

** ** **

అక్టోబరు వచ్చింది... పోయింది

మార్చి కూడా వచ్చిపోయింది

అతను పరీక్షలుమాత్రం రాయలేదు!

డబ్బులు పంపేందుకు ఎవరూ లేరిప్పుడు! ఆస్తులు, అప్పులూ బ్యాలెన్స్ ట్యాలీ అయ్యేట్టుచూసి వెళ్ళిపోయాడు వెంకటయ్య.

తన చిన్న ప్రపంచంలోంచి బయటికి వచ్చాడు. బయటి ప్రపంచంలో మనుగడకోసం పోరాటం ఎంత తీవ్రంగా వుంటుందో తెలిసింది.

బలహీనమైన వ్యాపకాల పునాదుల మీద బలమైన ఆశా సౌధాలనునిర్మించాలను కొన్నాడు.

వివేకం, విచక్షణ, నిగ్రహం... అన్నీ వయసు వేడిలో కరిగి పోయింతర్వాత... ఇప్పుడు పశ్చాత్తాపం. ఎక్కడ పట్టాలు తప్పాడో ఇప్పుడు తెలిసికొన్నాడు. ఎంత పశ్చాత్తాప్పడినా కాలం వెనక్కి తిరుగదు కదా! టేబుల్ మీద గ్లాసులో కొట్టిన శబ్దం వినగానే శూన్యం లోంచి చూపులు మరల్చాడు సుబ్బరాయుడు. ''రెండు మసాలా దోశలు... అర్జెంట్‌గా పట్టావాలి!'' బరువుగా నిట్టూర్చి ప్లేట్లు తీసికొని లోనికి వెళ్ళిపోయాడు. ◆